ఓం నమో నాగాభరణాయ

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన మహాశివరాత్రి వేడుకలు నియోజకవర్గంలో అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం వేకువ జాము నుంచే శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. రోజంతా ఉపవాసాలతో.. రాత్రి జాగారంతో శివనామస్మరణ చేశారు.

దాబాగార్డెన్స్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు పంచాక్షరీ మంత్ర ప్రతిధ్వనులతో మార్మోగాయి. మెయిన్‌రోడ్డులో గల విశ్వేశ్వరాలయంలో వేకువ జాము నుంచే పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. సింగ్‌హోటల్ జంక్షన్ శివాలయం వీధిలో ఉన్న ఓంకార ఆలయంలో ప్రాతఃకాలం నుంచే ఓంకారేశ్వర స్వామికి అభిషేకాలు జరిపారు. ఏవీఎన్ కాలేజీలో ఉన్న శివాలయం, పోలీస్ బ్యారెక్స్‌లో గల ఉమా రామలింగేశ్వరాలయం, పోలీస్ క్వార్టర్స్‌లో గల ఉమా రామలింగేశ్వరాలయం, వన్‌టౌన్ భీమాశంకరాలయం, గొల్లలపాలెంలో గల శివాలయం, పెరికివీధిలో గల శివాలయం, అస్సాం గార్డెన్స్‌లో గల శివరామకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దిగువ రెల్లివీధి పంచాయితీ రెల్లి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంచు శివలింగం ఏర్పాటు చేశారు. బురుజుపేటలో గల భావన రుషి ఆలయంలో శివరాత్రి ప్రత్యేక పూజలు జరిపారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

అల్లిపురం: మహా శివరాత్రిని పురస్కరించుకుని నియోజకవర్గంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామికి ఆలయ అర్చకుడు భార్గవశర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల గోత్రనామాలతో సహస్ర నామాభిషేకాలు చేపట్టారు. సాయంత్రం దేవాలయం ఆవరణలో జరిగిన మహా రుద్రాభిషేకంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


భావన రుషి ఆలయంలో శివపార్వతులు

నమకచమక విన్యాశాలతో పాటు పంచాక్షరీ మంత్ర జపం నిర్వహించారు. ఓం నమః శివాయ నామస్మరణతో దేవాలయం మార్మోగింది. అదే విధంగా డీటీకే రైల్వే క్వార్టర్స్‌లో గల భవానీ శంకర ఆలయంలోను, మురళీధరవీధిలో పంచముఖేశ్వర ఆలయంలో ఆలయ అర్చకుడు పి.సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, పండ్లరసాలతో ఏకవారాభిషేకాలు, సాయంత్రం 3 గంటల నుంచి మహా రుద్రాభిషేకం చేపట్టారు. బౌడారా రోడ్డులో గల శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.


నీలమ్మ వేపచెట్టు అమ్మవారి సన్నిధిలో మేయర్ హరి వెంకట కుమారి, విజయలక్ష్మి తదితరులు

వైభవంగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారి జాతర

అస్సాం గార్డెన్స్‌లో వెలసిన శ్రీ నీలమ్మవేపచెట్టు అమ్మవారి శివరాత్రి వార్షిక జాతర మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారికి ఆలయ అర్చకుడు శంభర జోగారావుశర్మ ఉదయం నుంచి విశేష పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు ద్రోణంరాజు శ్రీ వత్సవ్, కళా హాస్పిటల్


భావన రుషి ఆలయం వద్ద పరమశివునికి మహిళల పూజలు

అధినేత పైడి రమణమూర్తి తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాట, పులివేషాలు, గుర్రం బొమ్మలు, నెమలి డ్యాన్సులు, ఇంద్రాణిరెడ్డి బృందంచే కూచిపూడి, నాట్యపరిమళచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వచ్ఛంద సంస్థలు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశాయి.

ఆకట్టుకున్న శివలింగం, శివ ప్రతిమ

మహా శివరాత్రి సందర్భంగా నీలమ్మ వేపచెట్టు రోడ్డులో జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగం, ముక్కంటి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులు స్వామిని దర్శించుకుని సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

భక్తులకు వైద్య సేవలు

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం వార్షిక జాతర మహోత్సవంలో ఎన్ఆర్ఐ హాస్పిటల్ సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు బీపీ, షుగర్ చెక్ చేసి సలహాలు, సూచనలు అందజేశారు

అన్నప్రసాద వితరణ

మహా శివరాత్రి సందర్భంగా నేరెళ్లకోనేరు జంక్షన్‌లో కేఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు దంపతులు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అష్ట ప్రహార

బౌడారారోడ్డులోని పండావీధిలో ఉత్కల యువ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా అఖండ హరినామ సంకీర్తన (అష్ట ప్రహార) శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు హరినామ సంకీర్తన ప్రారంభించామని.. బుధవారం ఉదయం 10 గంటలతో హరినామ జపం పూర్తవుతుందని నిర్వాహకులు తెలిపారు.


విశేష అలంకరణలో పంచముఖేశ్వర స్వామి


బౌడారా రోడ్డు శివాలయం వద్ద భక్తుల బారులు


భక్తులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

భక్తులకు ప్రసాద వితరణ

మహా శివరాత్రి సందర్భంగా వాసవీ క్లబ్ అల్లిపురం ప్రతినిధులు డీటీకే రైల్వే క్వార్టర్స్‌లో గల శివాలయంలో మహా ప్రసాద వితరణ చేపట్టారు. జోన్ చైర్ పర్సన్ పోలిశెట్టి పుష్పలత, క్లబ్ ప్రెసిడెంట్ డీవీఎస్ఎన్ రాజు, సెక్రటరీ బీవీఎల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ ఆలయంలో..


ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు


ఎరుకుమాంబ పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో మహా శివరాత్రి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ఉదయం ఐదు గంటల నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు పురవీధుల్లో సాంస్కృతిక, నృత్య, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధులకు అన్న సమారాధన


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న అప్పలనాయుడు కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్: శనివారం నగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో వృద్ధులకు అన్న సమారాధన నిర్వహించారు. స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. సంఘ సేవకుడు పోలిపల్లి అప్పలనాయుడు ఐదో వర్ధంతిని ఆయన భార్య పి.లక్ష్మి, కుమార్తె శ్రావణి నిర్వహించారు. అనాథల సేవలోనే తృప్తి ఉంటుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించి వారిని ఆదుకోవాలన్నారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులను కొనియాడారు. కొద్దిసేపు వృద్ధులతో ముచ్చటించారు. వివేకానందుని చిత్రపటాన్ని సంస్థ సభ్యులు అప్పలనాయుడు కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఘనంగా చినదుర్గాలమ్మ తొలేళ్ల ఉత్సవం

అల్లిపురం: అచ్చియ్యమ్మపేటలో వెలసిన చిన దుర్గాలమ్మ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం శనివారం సందడిగా నిర్వహించారు. వేపకొమ్మలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తయారు చేసి తిరువీధి వైభవంగా చేపట్టారు. అనంతరం అమ్మవారి మాలధారులు అగ్నిగుండం తొక్కి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి ఎం.రమేష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్రభరత్, బెహరా మహేష్, నగర కార్యదర్శి దొడ్డి నాని అమ్మవారిని దర్శించుకున్నారు. చిన దుర్గాలమ్మ అమ్మవారి ప్రధాన పండగ ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.


విశేష అలంకరణలో చిన దుర్గాలమ్మ

ఎన్నికల అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాఖ విద్య: ఐఎన్‌సీఈ కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల నిర్వహణలో ప్రస్తుత పాలక వర్గానికి వత్తాసు పలుకుతున్న ఎన్నికల అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఐఎన్‌సీఈ, బీఎంఎస్ యూనియన్ల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న జరగనున్న సహకార ఎన్నికల్లో ప్రస్తుత పాలక వర్గమైన సీఐటీయూ అనుబంధ యూనియన్‌కు మేలు చేసేలా ఎన్నికల అధికారి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారిని తక్షణమే మార్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిష్పక్షపాతంగా నిర్వహించేలా కలెక్టర్, సహకార శాఖ జిల్లా రిజిస్ట్రార్ జోక్యం చేసుకోవాలని ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు ఎస్.రాజేష్ కోరారు.

త్వరలో కెరీర్ ఓరియంటేషన్, గైడెన్స్ సెల్

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీలోని గిరిజన విద్యార్థినుల వసతి గృహంలో కెరీర్ ఓరియంటేషన్, గైడెన్స్ సెల్ త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వసతి గృహానికి చేరుకున్న ఆయన గంటన్నరకు పైగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్య, వాష్ రూమ్స్, వార్డెన్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్టాక్ ఫైల్స్, మెస్ నిర్వహణను పరిశీలించారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి నిర్వహణ బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఐదేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్న వార్డెన్ బదిలీకి సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. బాత్‌రూమ్స్‌కు తలుపులు సక్రమంగా లేకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం వంటి పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి రవిబాబు మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలు దిశగా విద్యనభ్యసించాలని సూచించారు. హాస్టల్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రవిబాబు

మానసిక ప్రశాంతతే పెద్ద సంపద

ఏయూక్యాంపస్ : ప్రపంచ దిశ.. దశను మార్చగల సత్తా యువతకే ఉందని సహజ యోగ ప్రతినిధి, నేషనల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు రమేశ్ అన్నారు. ఏయూ స్నాతకోత్సవ మందిరంలో నిర్వహిస్తున్న మాతాజీ నిర్మలాదేవి శత జయంతి ఉత్సవాలలో భాగంగా రెండో రోజు యువశక్తి విభాగం ఆధ్వర్యంలో యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నేడు యువత పెడతోవ పట్టడానికి గల కారణాలను సహజ యోగ ప్రతినిధులు వివరించారు. యువత చక్కని లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరేందుకు క్రమశిక్షణతో, అంకిత భావంతో పనిచేయాలన్నారు. యువత పోషించే పాత్ర పైనే ఆ దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సోంబాబు, వెంకటరెడ్డి, పద్మావతి పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న యువతతో నిర్వాహకులు

ఏపీ విద్యా విధానం దేశానికే ఆదర్శం

భీమునిపట్నం: మన రాష్ట్రంలోని విద్యా విధానం దేశానికే ఎంతో ఆదర్శంగా ఉందని ఆర్జేడీ ఎం.జ్యోతి కుమారి అన్నారు. ఢిల్లీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు చెందిన విద్యాధికారుల బృందం శనివారం ఇక్కడి జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్), కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి బృందాలు వీటిని సందర్శించడం వల్ల పరస్పరం విద్యా విధానం గురించి తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇక్కడి ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేస్తోందని, అందులో భాగంగా వారికి నాణ్యమైన విద్యతోపాటు, అన్ని సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఢిల్లీ విద్యాధికారులు శ్రీరామ్‌కిశోర్, రుసు చౌదరి, సునీత మిట్టల్, ఇరత సభ్యులకు బోధన విధానాలను వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, డైట్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.


డైట్ కాలేజీలో ఢిల్లీ విద్యాధికారుల బృందం

మేటి చిత్రం శంకరాభరణం


మాట్లాడుతున్న రాంభట్ల నృసింహశర్మ

సీతంపేట: సాహిత్య సురభి ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'శంకరా విశ్వనాథా పర' అనే అంశంపై సాహితీవేత్త రాంభట్ల నృసింహశర్మ ప్రసంగించారు. ఈ సభకు వృద్ధుల కల్యాణ రామారావు అధ్యక్షత వహించగా, అతిథులుగా సినీ నటులు ఎస్.కె.మిశ్రో, డాక్టర్ ద్వారం వెంకటకృష్ణ గణేశ త్యాగరాజు విచ్చేశారు. ఈ సందర్భంగా రాంభట్ల మాట్లాడుతూ శంకరాభరణం సినిమా రాక ముందు కథా అంశం, సంగీత ప్రాధాన్యం విషయాలను వివరించారు. పాశ్చాత్య సంగీత పెను తుపానుకు రెపరెపలాడుతున్న సత్సాంప్రదాయ సంగీత జ్యోతిని ఒక్క కాపు కాయడానికి శంకరాభరణం చిత్రం నిర్మించిన మహానుభావులకు పాదాభివందనం చేస్తున్నానన్నారు. శంకరాభరణం శంకరశాస్త్రిగా పేరు గాంచిన జె.వి.సోమయాజులు ఒక గొప్ప సంగీత విద్వాంసుడని, ఆయన సంగీతమంటే చెవి కోసుకునే వాళ్లు చాలా మంది ఉంటారన్నారు. కళలను ఆరాధించే తులసి (మంజు భార్గవి) గురుభావంతో శంకర శాస్త్రిని ఆరాధిస్తుందన్నారు. ఓంకార నాదాను, దొరకునా ఇటువంటి సేవ, బ్రోచేవారెవరురా, శంకరా నాదశరీరా పర, ఏ తీరుగ నను, పలుకే బంగారమై ఇలాంటి ఆణిముత్యాల్లాంటి పాటలు, సంగీత ప్రాధాన్యం గురించి వివరించారు. ఈ చిత్రం తర్వాత దర్శకుడు కె.విశ్వనాథ్ కళాతపస్విగా పేరుపొందారని, గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు తెలుగు చలన చిత్ర సీమలో సుస్థిర స్థానం లభించిందని పేర్కొన్నారు.

స్విగ్గీ డెలివరీ బాయ్ అదృశ్యం


తప్పిపోయిన వాసుపల్లి ఎల్లాజీ

అల్లిపురం : స్విగ్గీ డెలివరీ బాయ్ అదృశ్యమైన ఘటన మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాసుపల్లి ఎల్లాజీ గొడారిగోతులు ప్రాంతంలో కుటుంబంతో నివసిస్తున్నాడు. ఈ నెల 4వ తేదీ ఉదయం విధులకు వెళ్లిన ఆయన ఆ రోజు రాత్రి నుంచి కనిపించకుండాపోయాడు. దీంతో ఆయన భార్య స్వాతి 5వ తేదీ ఉదయం అతని సహచరుడిని వివరాలు అడగ్గా, ఎల్లాజీ బైక్ ఎల్లమ్మ తోటలో చూసినట్లు తెలిపాడు. అక్కడికి వెళ్లి చూడగా బైక్ పార్క్ చేసి వుంది. దీంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దగ్గరలో గల సీసీ కెమెరాను పరిశీలించగా బండి పార్క్ చేసి నడుచుకుంటూ వెళ్లినట్లు గుర్తించారు. దీంతో ఆమె మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఎల్లాజీ వయస్సు 34. ఎత్తు 5 అడుగుల 5 అంగుళాలు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అతని ఆచూకీ తెలిసిన వారు 0891-2746866, 9000265420 నంబర్లలో తెలియజేయాలని కోరారు.

మహిళపై దాడి కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

పీఎం పాలెం: మహిళపై దాడి చేసి గాయపరచిన కేసులో ఒకరికి న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 6వ వార్డు పరిధి కొమ్మాది అమరావతి కాలనీకి చెందిన ఉప్పాడ లక్ష్మిపై ఒడిశా రాష్ట్రానికి చెందిన సయ్యద్ రఫీ అక్టోబర్ 5, 2020న కత్తితో దాడిచేసి గాయపరిచాడు. బాధితురాలు పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రవికుమార్ హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి ఎస్ఐ సీహార్‌కు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. విచారణ జరిపిన అనకాపల్లి అడిషనల్ అసిస్టెంట్ జడ్జి నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించారని సీఐ రామకృష్ణ తెలిపారు.

22న ప్రపంచ స్కౌట్ థింకింగ్ డే

మద్దిలపాలెం: స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న స్కౌట్ థింకింగ్ డే నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కమిషనర్ నరవ ప్రకాశరావు తెలిపారు. ప్రపంచ స్కౌట్ ఉద్యమ నిర్మాత బాడెన్ పావెల్ 1857 ఫిబ్రవరి 22న లండన్‌లో జన్మించారన్నారు. ఆయన జయంతి రోజున ప్రపంచ స్కౌట్ అండ్ గైడ్స్ దినోత్సవంగా జరపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాల మేరకు ఈనెల 22, 23 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించడంతో పాటు పలు అంశాలపై పోటీలు ఏర్పాటు చేశామన్నారు. బీహెచ్‌పీవీ మార్గంలోని సంసిదా ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా కొణతాల

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గాయత్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొణతాల వెంకట అప్పారావు (శ్రీనివాస్) కాంగ్రెస్ తరఫున బరిలో దిగుతున్నారు. పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు.

నిత్యాన్నదాన పథకం ప్రారంభం

దాబాగార్డెన్స్: దేవదాయ శాఖ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా పాతనగరం కురుపాం మార్కెట్లో నిత్యాన్నదాన పథకాన్ని ఆ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా తలచి దేవదాయ శాఖ ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇక నుంచి ప్రతిరోజూ వంద మందికి రుచికరమైన ఆహారం అందజేయనున్నట్టు చెప్పారు. కురుపాం మార్కెట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శేఖర్‌బాబు, కనకమహాలక్ష్మి దేవస్థానం ఏఈవో వెంపలి రాంబాబు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వసంతరావు తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన పథకాన్ని ప్రారంభిస్తున్న సహాయ కమిషనర్ శిరీష

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నెహ్రూ అవార్డులు


సీఎండీ నుంచి అవార్డులందుకుంటున్న విశ్వనాథరాజు, రఘు నాయక్, వెంకటరమణ, ఎల్లేటి శ్రీనివాసరావు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 96 మంది ఉద్యోగులకు యాజమాన్యం జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులను అందజేసింది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకత, క్షమశిక్షణ కలిగిన ఉద్యోగులకు ఏటా ఉక్కు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అవార్డులను అందజేస్తోంది. ఇందులో భాగంగా శనివారం ఉక్కునగరం ఎంపీ హాలులో స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ చేతులు మీదుగా 49 మంది అధికారులు, 49 మంది కార్మికులకు అవార్డులను అందజేశారు. అదే విధంగా ప్రతిభ చూపిన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి కమెండేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు వీవీ వేణుగోపాలరావు, డీకే మహంతి, బాగ్చీతో పాటు పలువురు ఉన్నతాధికారులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్ల ధర్నా జయప్రదానికి పిలుపు

మద్రిపాలెం: ఈ నెల 27న జరగనున్న విశాఖపట్నం పోర్టు, డీఎల్‌బీ పెన్షనర్లు, ఎంప్లాయీస్ ధర్నాను విజయవంతం చేయాలని పెన్షనర్లు పిలుపునిచ్చారు. మాధవధార కళింగనగర్‌లోని పెన్షనర్ల కార్యాలయంలో విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఈ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ వద్ద ఈ నెల 27న ధర్నా చేస్తామని వారు తెలిపారు. పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేయడం విరమించుకోవాలని, పోర్టు ఆస్పత్రిలో పోర్టు డీఎల్‌బీ పెన్షనర్లకు ప్రస్తుతం ఇస్తున్న వైద్య సదుపాయాలు మెరుగు పరచాలని కోరారు. పలు అంశాలు, డిమాండ్ల సాధనకు ధర్నా చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు తెలిపారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పెన్షనర్లు

కంచరపాలెం రైతుబజార్‌లో అన్నదానం

కంచరపాలెం: మహాశివరాత్రి సందర్భంగా బిల్వపత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కంచరపాలెం రైతుబజార్‌లో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.వి.ఎస్.రవి మాట్లాడుతూ వారాంతంలోనూ, ఆయా పర్వదినాల్లో పేదలు, వృద్ధులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 500 మందికి అన్నప్రసాదం చేసినట్లు ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కె.కృష్ణమూర్తి, ట్రస్ట్ సభ్యులు వెంకటరావు, సుబ్బారెడ్డి, కుమారస్వామి, రాజు, రవి, శంకర్ రాము, నరసింగరావు, సీతారామయ్య, పార్వతి, లక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు